# హక్కులున్నా అమలు సున్నా

కె. బాలగోపాల్

దేశ అభివృద్ధి ఖర్చు ఆదివాసులు భరిస్తున్నారని వాల్టర్ ఫెర్నాండెజ్ అనే పరిశోధకుడు కొంత కాలం కింద గణాంకాలతో సహా బయటపెట్టడం సంచలనానికి కారణం అయింది. ఆయన సేకరించిన గణాంకాలు తప్పని ప్రభుత్వం ఎదురు వాదన చేస్తుందని చాలామంది చూసారు. అదేం జరగలేదు. ప్రభుత్వమే కాదు, దేశ అభివృద్ధి నమూనా గొప్పదని నమ్మేవారెవరూ కూడా ఆయన వాదనను పూర్వపక్షం చేసే ప్రయత్నం చేయలేదు. 'అయితే ఏం?' అన్నట్టు మౌనంగా ఉండిపోయారు.

ఈ మధ్యకాలంలో ఏజెన్సీ ఆదివాసులకు బలమైన హక్కులు కల్పించే చట్టాలొచ్చాయి కాబట్టి ఈ పరిస్థితి మారి ఉంటుందనుకునేవారు ఖమ్మం జిల్లాకు పోయి చూడవచ్చు. చట్టాలొచ్చాయి, నిజమే. అవి హక్కులు కల్పించిన మాటా నిజమే. కానీ సామాజికంగా బలహీనులయిన వారికి హక్కులు కల్పించే చట్టాలు వాటంతటవి అమలు కావు. కనీసం అటువంటి చట్టాలు వచ్చాయనీ అవి కొత్త హక్కులు కల్పించాయనీ ప్రజలకు తెలియజెప్పే సంస్కృతి కూడ మన పాలనా యంత్రాంగానికి అలవడలేదు. ప్రజలే తెలుసుకొని గట్టిగా ఒత్తిడి పెట్టి అమలు చేయించుకునే ప్రయత్నం చేసేదాకా ఏ మార్పూ రానట్టే నడుచుకుంటారు. తాసీల్దార్లు, ఫారెస్ట్ రేంజర్లే కాదు తాము సర్వజ్ఞులమని దబాయించే ఐఎఎస్ అధికారులు సహితం ఏమీ మారనట్టే వ్యవహరిస్తారు. కొత్తగా సంక్రమించిన హక్కులను తెలుసుకొని, బలంగా ఆందోళన చేయగల ఉద్యమాలిప్పుడు కరువయ్యాయి. దీనికి ఎవరిని తప్పు పట్టాలన్న చర్చ సులభంగా తెగేది కాదు గానీ మన రాష్ట్రంలో అభివృద్ధి పేరు మీద ఆదివాసుల మనుగడపైన జరుగుతున్న దాడిని ఎదుర్కోగల ఉద్యమాలు అవసరంలో ఒక శాతం కూడ లేవు.

ఖమ్మం జిల్లాలో సింగరేణివారి ఓపెన్‌కాస్ట్ గనుల విస్తరణ, పోలవరం డ్యాంలు కలిసి గుండాల, ఏడూళ్ల బయ్యారంల నుండి కూనవరం, దమ్మపేటల దాకా ఏజెన్సీ మొత్తాన్ని కబళించేస్తున్నాయి. ఆదివాసులు వేల సంఖ్యలో తమ భూములకూ అడవికీ నీటి వనరులకూ దూరమయి ఎక్కడో ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చే కాలనీలో ఇళ్లు కట్టుకొని ఉంటూ రెక్కల కష్టం తప్ప ఏ వనరూ లేకుండ బతుకు వెళ్లదీసే దుస్థితి త్వరలోనే చూస్తాము.

తమ భవిష్యత్ చిత్రం వాళ్లకు స్పష్టంగానే గోచరిస్తున్నది. మణుగూరు ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ విస్తరణ కోసం, దుమ్ముగూడెం రిజర్వాయర్ కోసం ఊర్లు ఖాళీ చేయవలసివస్తుందని భయపడుతున్న ఆదివాసులు 'కొండాపురం వాళ్లకు పట్టిన గతే మాకూ పడుతుంది' అని ఆందోళన చెందుతున్నారు. కొండాపురం మణుగూరులో వెలసిన మొదటి ఓపెన్ కాస్ట్‌కోసం ఖాళీ చేసిన కోయగూడెం. ఒక దశాబ్దం కింద వాళ్లు గట్టిగానే ప్రతిఘటించారు. 42 ఇళ్లున్న ఆ గూడెంలో 17 కుటుంబాలకు స్వంత భూములుండేవి. మిగిలిన వాళ్లలో కొందరికి అసైన్‌మెంట్ పట్టా భూములుండేవి. అందరికీ అంతో యింతో పోడు కొట్టుకున్న భూమి ఉండేది. అడవిలో ఉచితంగా మేత దొరుకుతుంది కాబట్టి ఇంటింటా పశువులుండేవి. అవసరానికి అడవిలో కట్టె దొరికేది. విప్ప పూలు, చిల్లగింజలు, ముష్టి గింజలు మొదలయిన అడవి ఉత్పత్తులు దొరికేవి.



ఓపెన్ కాస్ట్ మట్టి కుప్పలు పోయడానికి కొండాపురం ఊరూ, చెల్కలూ సింగరేణికి కావలసి వచ్చినప్పుడు వారికి చాలా ఆశ చూపించారు. మణుగూరు దగ్గర మంచి కాలనీ కట్టిస్తామన్నారు. ఒక్కొక్క కుటుంబానికీ రెండెకరాల సాగు భూమి ఇస్తామన్నారు. కుటుంబంలో ఒకరికి సింగరేణిలో ఉద్యోగం ఇస్తామన్నారు. నెల జీతం వచ్చే ఉద్యోగం గ్రామీణ యువకులకు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది కాబట్టి ఊర్లు ఖాళీ చేయంచడానికి ఈ హామీని పాలకులు నిస్సిగ్గుగా వాడుకుంటున్నారు. కాలనీ కట్టివ్వలేదు. మణుగూరు దగ్గర ఒక్కో ఇంటికి ఐదు సెంట్ల భూమి ఇచ్చి, మామూలుగా ప్రభుత్వం గ్రామీణ గృహ నిర్మాణ పథకాల కింద ఇచ్చే సబ్సిడీ ఇచ్చి ఇల్లు కట్టుకొమ్మన్నారు. భూమంటారా, సొంత భూములున్న 17 కుటుంబాలకూ గిరిజనేతరులతో వివాదంలో ఉన్న భూములిచ్చారు. మేము సాగు చేసుకోవడానికి పోతే, గిరిజనేతరులు అడ్డు పడుతున్నారని అధికారులకు వారు ఫిర్యాదు చేస్తే, గొడ్డలి తీసుకొనిపోయి నరకండి అని స్వయంగా తాసీల్దారు, ఎస్ఐ సలహా ఇస్తున్నారు. సొంత భూములు లేని వారికి బండలు, రాళ్ళు నిండిన బంజర్లు ఇచ్చారు. వాటిని సాగులోకి తెచ్చే సాహసం కొండాపురం వాసులు చేయలేదు. ఉద్యోగాల విషయం ఎత్తితే మొదట అందరితో పాటు మీరూ పరుగు పందెంలో పాల్గొని మీ యోగ్యత రుజువు చేసుకోండి అన్నారు. అట్లాగయితే నిర్వాసితులుగా మీరు మాకేమిచ్చినట్టు అని గొడవ పెట్టుకుంటే, కరీంనగర్‌లో, ఆదిలాబాద్‌లో పని చూపిస్తాం అక్కడికి పొండి అన్నారు. మా ఊళ్ళో మీరు గనులు నెలకొల్పి, మమ్మల్ని అంత దూరం పొమ్మంటే ఎందుకు పోతామంటే, చివరకు సొంత భూములున్న 17 కుటుంబాలకు ఉద్యోగం బదులు 60 వేల రూపాయల నగదు ఇచ్చి, మిగిలిన వారికి ఒట్టిచేయి చూపించి వదిలించుకున్నారు. కొండాపురం కోయ ప్రజలు ఇప్పుడు మణుగూరు దగ్గర కొత్త కొండాపురంలో ఉంటున్నారు. పశుగ్రాసం లేక పశువులను అమ్ముకున్నారు. అటవీ సంపద అందుబాటులో లేక ఒక ముఖ్య ఆదాయ వనరు కోల్పోయారు. కూలీ దొరికిన రోజు పని చేసుకుంటూ లేని రోజు మిగుల్చుకున్నది తింటూ బతుకు ఈడుస్తున్నారు.

పునరావాసం సంగతి అట్లా ఉంచి, అసలు ఏజెన్సీలో భూసేకరణనే గట్టిగా ప్రతిఘటించే అవకాశం కల్పించే చట్టాలిప్పుడున్నాయి. 'పెసా' చట్టం ఏజెన్సీ గ్రామాలకు తమ వనరులనూ సంప్రదాయాలనూ పరిరక్షించుకునే హక్కు కల్పించింది. వనరులు అంటే భూములు, అడవులు కూడానని వివరించి చెప్పనక్కరలేదు. ఆదివాసుల సంప్రదాయాలు సహితం తమ నివాసస్థలంతో ముడిపడి ఉంటాయి. అంటే తమ భూమినీ పరిసర అడవులనూ ఆవాస స్థలాన్నీ పరిరక్షించుకునే హక్కు ఆదివాసీ ప్రజలకు 'పెసా' చట్టం కింద ఉంది. అటువంటిదేమీ లేనట్టు నటిస్తూ ప్రభుత్వం వారి గ్రామాలను ఖాళీ చేయిస్తుండగా, దానికి అర్థాన్ని కల్పించి అమలు చేయించుకునే శక్తి ఆదివాసీ ఉద్యమాలకు లేకుండాపోయింది. ఏజెన్సీలో భూసేకరణ చేసే ముందు, పునరావాస పథకాలు అమలు చేసే ముందు, సంబంధిత మండల పరిషత్‌ను తప్పనిసరిగా సంప్రదించాలని కూడ 'పెసా' చట్టం చెప్తుంది. సంప్రదించడం అంటే ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం సమాచారం వారి ముందు ఉంచి, బాధ్యత గల అధికారి మండల పరిషత్ సమావేశానికి హాజరై, వారు కోరుకున్న వివరణ ఇవ్వాలి, అభ్యంతరాలకు జవాబు చెప్పాలి. కాగా, పోలవరం కోసం భూసేకరణ చేస్తున్న 7 ఏజెన్సీ మండలాలలో, ఓపెన్ కాస్ట్ గనులకోసం భూసేకరణ చేస్తున్న 6 ఏజెన్సీ మండలాలు, దేనిలోనూ ప్రభుత్వం ఈ నియమాన్ని పాటించలేదు. అసలు 'పెసా' చట్టం అనేది లేనట్టే వ్యవహరిస్తున్నది.

ఏజెన్సీ ఆదివాసులకు బలమైన హక్కులు కల్పించే చట్టాలొచ్చాయి కాబట్టి ఈ పరిస్థితి మారి ఉంటుందనుకునేవారు ఖమ్మం జిల్లాకు పోయి చూడవచ్చు. చట్టాలొచ్చాయి, నిజమే. అవి హక్కులు కల్పించిన మాటా నిజమే. కానీ సామాజికంగా బలహీనులయిన వారికి హక్కులు కల్పించే చట్టాలు వాటంతటవి అమలు కావు. కనీసం అటువంటి చట్టాలు వచ్చాయనీ అవి కొత్త హక్కులు కల్పించాయనీ ప్రజలకు తెలియజెప్పే సంస్కృతి కూడ మన పాలనా యంత్రాంగానికి అలవడలేదు.

సేకరిస్తున్న భూములలో పోడు భూములు చాలా ఉన్నాయి. ఒకనాడు పోడు కొట్టడం నేరంగానీ అటవీ హక్కుల చట్టం జారీ అయిన తరువాత పరిస్థితి పాక్షికంగా మారింది. 2005 డిసెంబర్ 13కు ముందు పోడు కొట్టుకున్న భూములకు పట్టా ఇవ్వాలి. ఆ ప్రక్రియ మొదలయిందిగానీ చాలా గ్రామాలలో పూర్తి కాలేదు. ఆ లోపలే దానిని ప్రభుత్వ భూమిగా చూపించి పోలవరానికో సింగరేణికో కేటాయించడం జరిగిపోతున్నది. ఇప్పటికే పోడు భూములు ప్రభుత్వానికి స్వాధీనం చేసేసిన ఆదివాసులు చాలామంది ఉన్నారు. వాళ్ళకు పట్టా ఇవ్వాలి, ఆ తరువాత భూ సేకరణ చేయాలి, దానికి 'పెసా' చట్టంలోని నియమాలను పాటించాలి. కానీ ఏమీ జరగకుండానే పోడు భూములను ప్రభుత్వం తీసేసుకుంటున్నది. నిజానికి అటవీ హక్కుల చట్టం కింద పోడు భూములకు పట్టాలే కాదు, అనేక ఉమ్మడి వినియోగ హక్కులకు కూడ చట్టపరమైన గుర్తింపు రావాలి. ఆ గుర్తింపు ఇచ్చిన తరువాత దానిని భూసేకరణ పేరిట రద్దు చేయడానికి ప్రభుత్వానికి అధికారం ఇచ్చే అంశమేదీ అటవీ హక్కుల చట్టంలో లేదు. ఇదొక్కటే చాలు, ఖమ్మం జిల్లా అడవి ప్రాంతాలలో జరుగుతున్న భూసేకరణను మొత్తం ఆపివేయడానికి. కానీ దాని కోసం ఓపికగా, సూత్రబద్ధంగా పోరాడగల ఉద్యమశక్తి ఏదీ? ఉద్యమాలు స్వతహాగానే బలహీనంగా ఉండడం వల్ల కొంత, విపరీతమైన పోలీసు నిఘా, నిర్బంధాల వల్ల కొంత, 'అభివృద్ధి' భావజాలం వల్ల కొంత, ఆదివాసులను కదిలించగల ఉద్యమాలన్నీ నిస్తేజంగా ఉన్నాయి. అవి ఆటంకాలనూ బలహీనతలనూ అధిగమించేసరికి ఏమీ మిగలకపోవచ్చు.